క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పొన్నూరు: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదు చేయాలని తెలిపారు.

అంకిరెడ్డిపాలెంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డిపాలెంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, బి.శివలింగానాయక్, జే హరిబాబు, ఫణీధరం శివ, పట్టాభి శ్రీను, మౌనిక, షేక్ దిల్షా పాల్గొన్నారు.

వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం



గుంటూరు రూరల్: గాలులతో కూడిన వర్షం ఆదివారం కురిసింది. నగర శివారు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్రతరాయం ఏర్పడింది. గుంటూరు శివారు అంకిరెడ్డిపాలెం వైజంక్షన్ తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు గాలికి లేచి విద్యుత్ తీగలపై పడ్డాయి. హెచ్‌టీ లైన్ కావడంతో ఒక్కసారిగా సబ్ స్టేషన్‌లకు సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల లాలుపురం, బైపాస్ రోడ్ ప్రాంతంలో సరఫరా నిలిచింది. సుమారు మూడు గంటలు ఇబ్బంది పడ్డారు. ఏఈ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మరమ్మతులు అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

శాలివాహన సంఘ కార్యవర్గం ఎన్నిక



ఫిరంగిపురం: తాడికొండ నియోజకవర్గ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘ సమావేశం మండలంలోని అల్లంవారిపాలెం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కుమ్మర శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పి. ఈశ్వర్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.శివన్నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడికొండ నియోజకవర్గస్థాయి కుమ్మరశాలివాహన సంఘం అధ్యక్షుడిగా వి.నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కె. చంద్రశేఖర్, కోశాధికారిగా ఎస్.కొండలు, కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడిగా ఎం.ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా ఎన్.రమేష్‌లను ఎన్నుకున్నారు. వారికి నియామక పత్రాలను కార్పొరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు, యువజన కమిటీ సభ్యులు, పట్టణ మహిళ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863-2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు

లక్ష్మీపురం: రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న రౌడీషీటర్లు అందరూ స్టేషన్ అధికారులకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రధానంగా స్టేషన్ పరిధిలో ఎక్కడైనా వైట్ కాలర్ దందాలు, సెటిల్‌మెంట్లు, రౌడీ కార్యకలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని చెప్పారు. అదే విధంగా స్టేషన్ పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన పేకాట, వంటి పనులకు పాల్పడిన, గంజాయి, మత్తు పదార్థాలు తాగడం కాని, క్రయ, విక్రయాలు జరిగిన వాటిల్లో ఎవరైన ఉన్న సహించేది లేదన్నారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టేషన్‌లో సంతకాలకు హాజరు కావాల్సిందిగా కోరారు. స్టేషన్ దాటి వేరే ప్రాంతానికి వెళ్లే ముందు స్టేషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు.

సేవలకు.. స్వచ్ఛ పురస్కారాలు



పొన్నూరు మున్సిపాలిటీ

పొన్నూరు: పురపాలక సంఘం, నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, చేబ్రోలు గ్రామ పంచాయతీ జిల్లా స్థాయిలో స్వచ్ఛ పురస్కారాలు దక్కించుకుని ఆదర్శంగా నిలిచాయి. గుంటూరు జిల్లా కలెక్టర్ ఈ స్వచ్ఛ అవార్డులను ప్రకటించారు. ఉత్తమ పొదుపు సంఘాలలో పొన్నూరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీ మహిళ స్వయం సహాయక సంఘం, సిద్ధి వినాయక నగర్ మహిళా స్వయం సమాఖ్య సంఘాలతో పాటు పొన్నూరు పారిశుద్ధ్య కార్మికుడు వడ్లాది శ్రీనివాసరావుకు ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడు, చేబ్రోలు గ్రామ పంచాయతీలో స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్‌గా నల్లపాటి రాఘవమ్మకు అరుదైన పురస్కారాలు దక్కాయి. 2025 స్వచ్ఛాంధ్ర అవార్డులలో భాగంగా స్వచ్ఛత ప్రణాళిక అమలులో ఆదర్శంగా నిలవడంతో ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్ ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన స్వచ్ఛ ప్రణాళిక ఇప్పుడు సత్ఫలితాన్నిచ్చింది. ఈ ఏడాది జనవరి 15న ప్రారంభమైన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యాచరణను సంపూర్ణంగా అమలు చేశారు. పట్టణంలో అధ్వానంగా ఉన్న పలు వార్డులలో పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. 12 అంశాలతో ప్రతి నెలా చేపట్టిన స్వచ్ఛ ప్రణాళిక అమలు తీరును రాష్ట్ర బృందం పరిశీలించింది. ఈ నేపథ్యంలో స్వచ్ఛతలో గుర్తింపు సాధించడంతో ఈ అవార్డులు దక్కాయి. సోమవారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ అవార్డులను స్వీకరించనున్నారు.

ఇదే స్ఫూర్తి కొనసాగిస్తాం..



పట్టణ పరిధిలోని 31 వార్డులను స్వచ్ఛంగా మార్చడంతో అరుదైన పురస్కారం లభించింది. ఇదే స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజల సహకారంతో పొన్నూరు మున్సిపాలిటీని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం.

–ముప్పాళ్ల రమేష్‌బాబు, కమిషనర్

దహన సంస్కారాల కష్టాలు తొలగించేందుకే 'స్వర్గారోహణం'

సురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ పోశం ప్రగతి రెడ్డి



స్వర్గారోహణం మండపాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను కొంత మేరైనా తగ్గించాలన్న ఆలోచనతోనే స్వర్గారోహణం మండపాన్ని నిర్మించినట్లు సురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ పోశం ప్రగతి రెడ్డి తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని హిందూ శ్మశానవాటికలో దాతలు సుమారు రూ.16.5 లక్షలతో స్వర్గారోహణం మండపం, శివైక్యం భవనాలను నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమం దాతల చేతుల మీదుగా జరిగింది. దాతలు పోశం ప్రగతి రెడ్డి(గుంటూరు సురక్ష హాస్పిటల్) దహన సంస్కారాల మండపాన్ని, ప్రత్తిపాడుకు చెందిన బాపతు సాంబశివారెడ్డి, రజినీ దంపతులు శివైక్యం విశ్రాంతి భవనాన్ని, అస్థికల లాకర్‌ను గ్రామస్తుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రగతి రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం వలనే ఇది సాధ్యమయ్యాయన్నారు. నేటి నుండి ప్రత్తిపాడు వాసులు మండపాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. అనంతరం గ్రామ పెద్దలు దాతలైన ప్రగతిరెడ్డి, సాంబశివారెడ్డి, విజయ్‌లను దుశ్శాలువాలతో సత్కరించారు.

సీసీ రోడ్లుకు శంకుస్థాపన..

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో మరో కీలక అడుగు పడింది. శ్మశాన వాటికలో రూ.8 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించేందుకు మరో దాత స్పందన సంస్థల డైరెక్టర్ గంగిరెడ్డి పద్మజారెడ్డి ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణానికి దాత బంధువులైన సిద్ధారపు శివ రామకృష్ణారెడ్డి గ్రామస్తులతో కలిసి కొబ్బరి కాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జి.చంద్రశేఖర్‌రెడ్డి, వి.విజయ్‌కుమార్, బాపతు శ్రీనివాసరెడ్డి, నూతలపాటి అమర్, డబ్బూరి ఏడుకొండలు, కమ్మా శివప్రసాద్, మల్లం రామకృష్ణ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఎన్‌సీసీ దోహదం



క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో ఎన్‌సీసీ అధికారులు

- కల్నల్ సుధాంశు దూబే
- ఆర్‌వీఆర్‌జేసీలో ముగిసిన ఏపీ ట్రెక్ ఐఐఐ ఎన్‌సీసీ స్పెషల్ క్యాంప్

గుంటూరు రూరల్: ప్రాథమిక సైనిక శిక్షణ అందిస్తూ సమాజంపై వారికి ఉన్న బాధ్యతను నెరవేర్చే విధంగా విద్యార్థిని విద్యార్థులకు ఒక క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చేందుకు నేషనల్ క్యాడెట్ క్యాంప్ తోడ్పడుతుందని ఏపీ ట్రెక్ ట్రెక్ మేనేజర్ కల్నల్ సుదాన్షదుబే తెలిపారు. గత వారం రోజులుగా మండలంలోని చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఏపీ ట్రెక్ అండ్ ట్రెక్ క్యాంప్ నిర్వహించారు. ఆదివారం క్యాంప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రెక్ మేనేజర్ ఏపీ ట్రెక్ కల్నల్ సుదాన్షదుబే మాట్లాడుతూ ఏపీ తెలంగాణ డైరెక్టరేట్‌లోని 9 గ్రూపులకు సంబంధించిన 510 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ ట్రెక్ క్యాంపులో కోటప్పకొండ, కొండవీడు, విజయవాడ కొండపల్లి ప్రాంతాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్ ట్రెకింగ్ నిర్వహించడం జరిగిందని చెప్పారు. భారతదేశంలో 1948లో ఎన్‌సీసీ ఏర్పడిందని ఆర్మీలో సిబ్బంది కొరతను తీర్చే లక్ష్యంతో ఇండియన్ డిఫెన్స్ యాక్ట్ 1917లో దీనిని రూపొందించడం జరిగిందన్నారు. దేశంలోని పాఠశాల స్థాయి నుంచి కళాశాలలో చదివే వివిధ రకాల విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ అందించటం జరుగుతుందని తెలిపారు. అడ్వెంచర్స్ ద్వారా విద్యార్థులలో పోటీతత్వం పెంపొందించడమే కాకుండా శారీరకంగా మానసికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ అనేది ఒక వ్యక్తిని క్రమశిక్షణలో నడిపేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దేశంపై, సమాజంపై బాధ్యతను గుర్తుచేస్తూ సమాజానికి సేవ చేయాలనే భావాన్ని పెంపొందించేందుకు ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ముఖ్యంగా ఎన్‌సీసీని సెకండ్ లైన్ ఆఫ్ డిఫెన్స్‌గా అభివర్ణిస్తారని అటువంటి అత్యున్నత గుర్తింపు కలిగిన ఎన్.సి.సి. ద్వారా అన్ని రకాల అంశాలను కూడా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

వర్షం నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్ష ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచే వర్షం నీటిని ఎప్పటికప్పుడు బెయిల్ అవుట్ చేయడానికి మోటార్లను సిద్ధం చేసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు వర్షం తగ్గే వరకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకి సమస్య రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈలకు, ఎక్కడైనా చెట్లు పడిపోతే తొలగించడానికి సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ దగ్గర, రింగ్ రోడ్, చుట్ట గుంట సెంటర్‌లోని లోతట్టు ప్రాంతంలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, కల్వర్ట్‌ల దగ్గర ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద నిలిచే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సంబంధిత డీఈఈలకు, ప్రజారోగ్య అధికారులకు సూచించారు. నగర ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని, ఎక్కడైనా వర్షాల వలన సమస్యలు ఎదురైతే జీఎంసీ కాల్ సెంటర్ 0863 2345103 కి కాల్ చేయవచ్చని తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్‌ఐ రవీంద్రనాయక్ తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలోని డ్రైవర్ పేటకు చెందిన మహమ్మద్ ఇలియాస్ కార్ల వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు కుమారులు. 19 ఏళ్ల చిన్న కుమారుడు మహ్మద్ రజాక్ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వరకు చదువుకున్నాడు. చదువు మానివేసి ఇంటివద్దే ఉంటున్నాడు. గత నెల 21వ తేదీన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. సాయంత్రానికి కూడా ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను అడిగినా ఎక్కడా ఆచూకీ దొరకలేదు. రజాక్ ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో కాఫీ కలర్ టీ షర్టు, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ఎత్తు 5.10 ఉంటాడని, కర్లింగ్ హెయిర్ ఉన్నట్లు తండ్రి ఇలియాస్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై ఆదివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. భక్తిగాన లహరి ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలక మండలి వారు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. బోడపాటి శ్రీనివాసరావు బృందంతో పలు భక్తి గీతాలను ఆలపించారు. కీబోర్డుపై సాయి, తబలపై రమణ వాయిద్యాన్ని అందించారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

చేబ్రోలు: కళ్లలో శుక్లపు పొరలు కంటి చూపునకు అడ్డుపడుతున్నా.. వారి కనుపాపల్లో ఆనందాల జ్యోతులు వెలిగాయి. ఆ నడకల్లో సత్తువ మందగించినా.. ఆ వేదిక తాకగానే వారి పాదాలు నాట్యమాడాయి. తాతా అని పిలుపునకు చేరువైనా.. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు 50 ఏళ్లు వెనక్కి వెళ్లాయి. అక్షరాలు దిద్దించిన గురువుల జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా.. బాల్యపు స్నేహ మాధుర్యాలు అక్షర కుసుమాలై పరిమళించాయి. తమ చదువుల గుడికి దాతృత్వపు హారం వేసిన అపూర్వ ఘట్టాలు చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్‌లో ఆదివారం ఆవిష్కృతమయ్యాయి. 1974–75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. ఇక్కడ చదువుకొని వివిధ ప్రాంతాల్లో వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా ఒకచోటకు చేరుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. 50 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ కలయికలో ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పాత తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి విద్యార్థులకు చదువుచెప్పిన గురువులు చల్లా దుష్యంతరెడ్డి, బండ్లమూడి సాంబశివరావులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థి చల్లా కాసింరెడ్డి అధ్యక్షతన సమ్మేళనం జరిగింది. త్వరలో పాఠశాల స్థాపించి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఉత్సవా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గాదె వెంకటప్పారెడ్డి, హెచ్‌ఎం ఉడుముల మోహనరెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలి

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ



పేదలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులతో కలసి పుష్కర కాలనీ, సీతానగరం వద్ద ప్ల కార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రైల్వే, కొండ పోరంబోకు, ఇరిగేషన్ తదితరప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్లపట్టాలు, ఇంటి స్థలం లేని వారికి రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని పోతురాజు స్వామి గుడి, రన్నింగ్‌రూమ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సీపీఎం కార్యకర్తలతో కలసి పాదయాత్ర నిర్వహించి దరఖాస్తులు పంపిణీ చేశారు. ఈనెల 17వ తేదీ మంగళగిరిలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్ద పేదలందరు దరఖాస్తులతో తరలి రావాలని పిలుపునిచ్చారు. 2016లో కృష్ణా పుష్కరాల సందర్భంగా సీతానగరంలో 500 మంది పేదల ఇళ్లు తొలగించారని, ఆనాడు ఇచ్చిన హామీ నేటికీ నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే గతంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం, గ్రామాల్లోని అర్హులైన పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఇళ్ల స్థలాల సాధనకు ఈ నెల మూడవ తేదీ నుంచి పేదల పేటలో పాదయాత్రలు, కార్యక్రమాలు, పేదలకు అర్జీలు ఇవ్వడం జరుగుతోందన్నారు. 13,14,15 తేదీల్లో ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట దీక్షలు, 17వ తేదీ ఇంటి స్థలాలకు, పట్టాలకు అర్హులైన వారందరితో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, గాదే సుబ్బారెడ్డి, మేరీ, కోట బాబూరావు, దర్శనపు విజయబాబు, అంజిరెడ్డి, సుభాని, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత



శ్రీకృష్ణరాయభారం నాటకంలోని ఓ సన్నివేశం

పెదకాకాని: సమాజంలో అంతరించిపోతున్న కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరూ బాధ్యత అని వీరభద్ర సాంస్కృతిక కళాసమితి వ్యవస్థాపకుడు ఉల్లంగుల బ్రహ్మయ్య అన్నారు. మండల పరిధిలోని వెనిగండ్ల శివాలయంలో విజయ దశమి సందర్భంగా రెండు రోజులుగా పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. గుంటూరు శివశక్తి కళానాట్యమండలి పర్యవేక్షణలో తొలిరోజు ఆదివారం శ్రీకృష్ణరాయబారం నాటకంలోని సన్నివేశంతో పాటు సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శించారు. అలానే రెండో రోజు సోమవారం పోతులూరి వీరబ్రహ్మేంగారి చరిత్ర నాటకం ప్రదర్శించనున్నారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సంస్కృతి సౌజన్యంతో నాటక ప్రదర్శనల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉల్లంగుల బ్రహ్మయ్య మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన నిత్య జీవనంలో ప్రతి ఒక్కరిలో ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం నింపేదుకు కళా ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మహనీయుల చరిత్రలను తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ అంతరించిపోతున్న కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం పలువురు స్థానిక పెద్దలు కళాకారులను సత్కరించారు.

అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలి

లక్ష్మీపురం: అంగన్‌వాడీలకు ఆగస్టు, సెప్టెంబర్ బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రమణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం నెలనెలా జీతాలు చెల్లించేందుకు కూడా ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. పని చేయని సెల్ ఫోన్లు ఇచ్చి వాటిపైన సకాలంలో పని చేయలేదని తిరిగి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేస్తే సెప్టెంబర్‌లోగా అందరికీ ఫోన్లు ఇస్తామని చెప్పినా ఇంత వరకు అతిగతి లేదని చెప్పారు. అంగన్‌వాడీ హెల్పర్ల ప్రమోషన్లు దీర్ఘకాలం పెండింగ్లో ఉంటున్నాయని తక్షణమే ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు జీతాలు పెంపుదల చేసి ఆరున్నర ఏళ్ళు గడిచినా వారి జీతాలు పెంపుదలకు ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని తెలియజేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే తిరిగి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

నడికుడి రైల్వే స్టేషన్‌లో భద్రతా సదస్సు



లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి రైల్వే స్టేషన్‌లో భద్రతా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీఓఎం జె.శ్రీనాథ్ మాట్లాడుతూ ఈ సదస్సులో ఆపరేటింగ్ సిబ్బంది భద్రతా గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎమర్జెన్సీ రూట్ రద్దు విధానం, ఎమర్జెన్సీ పాయింట్ ఆపరేషన్, పవర్ బ్లాక్, ఫ్లాట్ టైర్, హాట్ యాక్సిల్ నిర్వహణ, రేక్ కదలిక, కార్యాచరణ పరిమితుల గురించి తెలిపారు. అలాగే సాధారణ, అసాధారణ పని సమయంలో ఎల్‌సీ గేట్, నాన్ ఇంటర్ లాక్ ఎల్‌సీ గేట్ విధానం గురించి అవగాహన కల్పించారు. వాహనాలను స్థిరపచడం, భద్రపరచడం, వంటి పలు విషయాలపై ఆపరేటింగ్ విభాగాధిపతులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ ఆపరేటింగ్ సిబ్బందితో కలసి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి



నిరసన కార్యక్రమంలో కేవీపీఎస్ నేతలు

తాడేపల్లి రూరల్: అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ గుండిమెడలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమన్నారు. దళితుల మధ్య తగాదాలు పెట్టడానికి, ఐక్యతను దెబ్బతీసేందుకు ఇలాంటి దుర్మార్గమైన చర్యలు గుర్తు తెలియని వ్యక్తులు చేశారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తాను ప్రధానిని అయ్యానని చెప్పుకునే నరేంద్రమోదీ రాజ్యాంగబద్ధంగా పరిపాలన సాగించడం లేదని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా చర్యలు తీసుకుంటోందని మండిపడ్డారు. బడ్జెట్‌లో, నిధుల కేటాయింపులో దళితులకు, గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. చిత్తూరు జిల్లాలో జరిగిన దుర్మార్గమైన ఘటనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నేతలు జోషి, నాగపోగు విజయరాజు, బత్తుల సంసోన్, ఎం. చిన్న, తంబి, ఏసురత్నం, చిన్నప్ప, కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలి

- సినీ నటి హెబ్బాపటేల్
- కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటి హెబ్బాపటేల్

గుంటూరు మెడికల్: మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా అవగాహన కల్పించాలని సినీ నటి హెబ్బాపటేల్ అన్నారు. కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్(తక్కెళ్లపాడు) ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు నగరంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి హెబ్బా పటేల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్ బారిన పడి ఆస్పత్రులకు వెళ్లకుండా ముందస్తుగానే అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ టి. మహతి మాట్లాడుతూ అక్టోబర్ అంతా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, సిమ్స్ విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ బి.శివశిరీషా మాట్లాడారు. క్యాన్సర్ వైద్యులు డాక్టర్ కందుల రామ్, డాక్టర్ శ్రీఫణి, డాక్టర్ సుమన్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ హరీష్, డాక్టర్ రాకేష్, షేక్ లాల్‌వజీర్ పాల్గొన్నారు.